సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం । 1 । జనవరి । 2024



కాకతీయుల కళావైభవం
కాకతీయుల కళాపోషణకు సజీవ సాక్ష్యాలుగా పలు కట్టడాలు దర్శనమిస్తున్నాయి.
వివరాలు 8లో ▸



.. హ్యాండ్‌బాల్ టోర్నీ
మహబూబ్‌నగర్‌లో సోమవారం రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.4 / 11.7
చలి తీవ్రత అధికంగా ఉండి అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలి

కందనూలు: 2024 విద్యాసంవత్సరం ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ విద్యాశాఖ అధికారులకు సూచించారు. జనవరి 1నుంచి 11వ తేదీ వరకు ఎక్కువ మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా చూడాలన్నారు. విద్యార్థులు తయారుచేసిన ప్రదర్శనలను తమ పాఠశాలల్లోనే ఏర్పాటు చేసుకొని, అందుకు సంబంధించిన వీడియోను (30 ఎంబీ మించకుండా) ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమాజం కోసం శాస్త్ర సాంకేతిక విద్య అంశంతో పాటు ఆరోగ్యం, పర్యావరణ హిత జీవన విధానం, వ్యవసాయం, కమ్యూనికేషన్, రవాణా, గణన నైపుణ్యం అంశాలపై ప్రదర్శనలను రూపొందించాలని తెలిపారు. ఆయా అంశాలపై ఉన్నత పాఠశాల నుంచి ఏవేని రెండు ప్రదర్శనలు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఒక ప్రదర్శన తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. గత విద్యాసంవత్సరం ఎంపికైన 66 ఇన్‌స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనలను సైతం ఆన్‌లైన్‌లో ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా ఇన్‌స్పైర్ కాంపిటిషన్ యాప్‌లో 18వ తేదీలోగా నమోదు చేయాలని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనతో పాటు విద్యార్థులకు ఆరోగ్యం, సుస్థిరమైన భూగ్రహం కోసం చిరుధాన్యాలపై సెమినార్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి (9989921105)ని సంప్రదించాలని కోరారు.

నిర్భయంగా షీటీంను సంప్రదించాలి

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలు, విద్యార్థినులు ఆకతాయిల వేధింపులకు గురయితే నిర్భయంగా షీటీంను సంప్రదించాలని అదనపు ఎస్పీ రామేశ్వర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలు, విద్యార్థినులపై వేధింపులకు పాల్పడే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. 2023లో 103 పిటిషన్‌లు రాగా.. 55 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు ఫేస్‌బుక్, వాట్సప్, ఇన్‌స్టాగ్రాం వినియోగంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. షీటీంకు ఫిర్యాదు చేయాలనుకునే వారు 8712657676 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో క్రీడాకారుల ప్రతిభ



అచ్చంపేట రూరల్: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో డిసెంబర్ 30, 31 తేదీల్లో నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. అన్ని విభాగాల్లో కలిపి 4 బంగారు, 8 రజత, 6 కాంస్య పతకాలతో పాటు 35ఏళ్ల వయసు పైబడిన విభాగంలో జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎద్దు శ్రీనుయాదవ్ తెలిపారు.

5న కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జనవరి 5న ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆఫ్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మహబూబ్‌నగర్‌లోని లయన్ రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్, ఓటరు, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని కోరారు. వివరాలకు సెల్: 9440454284, 8106333324 నంబర్లను సంప్రదించాలని కోరారు.



- కోటి ఆశలతో 2024కు స్వాగతం పలికిన జిల్లావాసులు
- అర్ధరాత్రి కేకులు కట్‌చేసి సంబరాలు
- హోరెత్తిన యువత నృత్యాలు



నయా జోష్

కందనూలు: కాలచక్రంలో మరో ఏడాది కరిగిపోయింది. ఎన్నో జ్ఞాపకాలు మిగిల్చి.. కాలగమనంలో కలిసిపోయింది. కొత్త ఆశలు, ఆకాంక్షలతో 2024 సంవత్సరం ప్రారంభమైంది. కోటి ఆశలతో జిల్లా ప్రజలు కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఆదివారం అర్ధరాత్రి 12గంటలకు కేకులు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా న్యూఇయర్ వేడుకలు అంబరాన్నంటాయి. ఎక్కడ చూసినా నయా జోష్ కనిపించింది. అర్ధరాత్రి వీధుల్లో బాణాసంచా కాల్చడంతో పాటు కేకులు కట్ చేశారు.

దుకాణాల్లో సందడి..

జిల్లా కేంద్రంతో పాటు అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ పట్టణాల్లోని దుకాణాలన్నీ కొనుగోలుదారులతో సందడిగా మారాయి. ముఖ్యంగా బేకరీలు, ప్రధాన చౌరస్తాలలో కేకుల విక్రయాలు జోరుగా సాగాయి. హోటళ్లు, రెస్టారెంట్లు కిటకిటలాడాయి. అదేవిధంగా మాంసం, మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. మహిళలు రంగవల్లులను తీర్చిదిద్దడానికి కావాల్సిన రంగులను కొనుగోలు చేస్తూ బిజీబిజీగా కనిపించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి..



కరోనా వంటి విపత్కర పరిస్థితుల తర్వాత మన జీవన విధానంలో అనేక మార్పులు వచ్చాయి. 2022, 2023 సంవత్సరాలు ఎప్పటికీ గుర్తుంటాయి. ఆయా సంవత్సరాలు ప్రతి మనిషికి గుణపాఠం నేర్పాయి. 2024 నుంచి అయినా ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపిస్తే మరోసారి కరోనా వంటి పరిస్థితులు రాకుండా చూసుకోవచ్చు. సో.. మన ఆరోగ్యం, మన చేతుల్లోనే ఉంది.
– డాక్టర్ వెంకటరమణ, నాగర్‌కర్నూల్

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు...



సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతాం. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలి. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. అందరి సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తా. ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి.
– జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ శాఖ మంత్రి

మాదక ద్రవ్యాలను కట్టడి చేస్తాం..



నూతన సంవత్సరంలో పోలీస్‌శాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. ముఖ్యంగా యువత చెడు వ్యసనాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు డ్రగ్స్, గంజాయి ఇతర మాదక ద్రవ్యాలను కట్టడి చేస్తాం. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండటంతో పాటు ప్రజలకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి న్యాయం జరిగేలా చూస్తాం. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నేరాలకు అడ్డుకట్ట వేస్తాం. నేరాలను ఎప్పటికప్పుడు ఛేదించేలా చర్యలు తీసుకుంటాం. అన్ని వర్టికల్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలో ముందుండేలా కృషి చేస్తాం. 2024 సంవత్సరంలో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నా.
– గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ

నేరస్తులకు శిక్ష పడేలా చూస్తాం..



గతేడాది జరిగిన పొరపాట్లు నూతన సంవత్సరంలో జరగకుండా ప్రణాళికా బద్ధంగా ముందుకెళ్తాం. న్యాయస్థానంలో నేరస్తులకు శిక్ష పడేలా కృషిచేస్తాం. సాంకేతికపరంగా నాగర్‌కర్నూల్ జిల్లా మొదటి స్థానంలో ఉండేలా చూస్తాం. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తాం. 2024 సంవత్సరంలో జిల్లా ప్రజలు అపజయం లేకుండా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆశిస్తున్నా.
– సీహెచ్ రామేశ్వర్, అదనపు ఎస్పీ

ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి..



నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం. ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీలు పకడ్బందీగా అర్హులకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తా. ఎన్నికల సమయంలో గ్రామాల్లో పర్యటించినప్పుడు నా దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేలా కృషిచేస్తా. ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు ప్రత్యేకంగా నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతా.
– కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

ఆశాజనకంగా మామిడి



కొల్లాపూర్ సమీపంలో సాగుచేసిన మామిడి తోటలు, ఇన్‌సెట్‌లో విరబూసిన మామిడి పూత

ఈ ఏడాది విరబూసిన పూత
- మరో నెలరోజులు వాతావరణం అనుకూలిస్తే దిగుబడికి ఢోకా లేనట్టే..
- ఏపీలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న తోటలు
- తెలంగాణ మామిడికి ధరలు పెరిగే అవకాశం

కొల్లాపూర్: కొన్నేళ్లుగా నామమాత్రపు దిగుబడులు మాత్రమే వస్తున్న మామిడి.. ఈసారి రైతులను ఊరిస్తోంది. మొదటి దశలోనే మామిడి పూత విరబూసి అందరిలో ఆశలు నింపుతోంది. జిల్లావ్యాప్తంగా మామిడి తోటలు పూతలతో కళకళలాడుతున్నాయి. ముందుగానే పూతలు రావడం.. రెండో దశ కూడా ప్రారంభం కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో చలి తీవ్రత మినహాయిస్తే.. అకాల వర్షాలు లేకపోవడంతో మామిడి పూత ఆశాజనకంగా ఉంది. ఇదే తరహాలో వాతావరణం కొనసాగితే మామిడి దిగుబడులకు ఈసారి ఢోకా లేనట్టే. అయితే తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టడంలో రైతులు నిర్లక్ష్యం చేయరాదని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

34,712 ఎకరాల్లో మామిడి సాగు..
నాగర్‌కర్నూల్ జిల్లాలో 2022–23 లెక్కల ప్రకారం 34,712 ఎకరాల్లో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. నాలుగేళ్ల కిందట మామిడి సాగు 25,931 ఎకరాల్లో మాత్రమే ఉండేది. ప్రతి సంవత్సరం 3వేల ఎకరాల మేరకు సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో సుమారు 9వేల ఎకరాల్లో మామిడి సాగు చేస్తుండగా.. కొల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 25వేల ఎకరాలకు పైగా మామిడి సాగు అవుతోంది. ఎకరాకు రెండున్నర మెట్రిక్ టన్నుల నుంచి మూడు మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

ముందుగానే పూత..
మామిడి పూత నవంబర్ నుంచి ప్రారంభమవుతుంది. ఈ ఏడాది కొంచెం ముందుగానే పూత వచ్చింది. నవంబర్‌లో వచ్చిన మొదటి పూతతో పాటు డిసెంబర్‌లో ప్రారంభమైన రెండో దశ పూత కూడా బాగానే ఉంది. గడచిన మూడేళ్ల కాలంలో ఈసారి పెద్ద మొత్తంలో మామిడి పూత పూయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పూత నిలిస్తే మామిడి దిగుబడి భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయి.

వాతావరణం అనుకూలించకుంటే నష్టం..
మామిడి పంటకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాలి. చలికాలంలో వర్షాలు కురిసి.. తేమ, చల్లటి గాలులు అధికంగా ఉంటే పూతకు పురుగు ఆశించి నష్టం చేకూరుతుంది. గతేడాది మాండూస్ తుఫాన్ కారణంగా మామిడి తోటలు బాగా దెబ్బతిన్నాయి. చలి, వర్షం కారణంగా తేనెమంచు (బంక తెగులు) పురుగు, నల్లిపురుగు, బూడిద తెగులు ఆశించడంతో రైతులకు పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లింది. ఈ ఏడాది కూడా చలి తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో పూతలు నిలిచాయి. కానీ బంక తెగులు మాత్రం యథావిధిగా కొనసాగుతోంది. దీని నుంచి తోటలను కాపాడుకుంటే మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. అయితే మరో నెలరోజులు వాతావరణం ఇదే తరహాలో అనుకూలంగా ఉంటే మామిడి తోటల రైతులు లాభాల బాట పట్టొచ్చని భావిస్తున్నారు.

వాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడి..



ఈ ఏడాది మామిడి తోటల్లో పూత బాగుంది. కొన్ని చోట్ల మాత్రం పూత సగమే వచ్చింది. వాతావరణం అనుకూలిస్తే ఈసారి మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. తేనెమంచు కారణంగా బంక తెగులు కూడా బాగానే ఉంది. మామిడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పంటకు మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలి.
– బాలచంద్రుడు, రైతు, కొల్లాపూర్

సస్యరక్షణ చేపట్టాలి..



ఈసారి మామిడి పూతలు బాగా వచ్చాయి. మామిడికి అధికంగా తేనెమంచు, బంక, బూడిద తెగుళ్ల వ్యాప్తి చెందుతూ ఉంటాయి. వీటికి సస్యరక్షణ చర్యలు చేపడితే మెరుగైన దిగుబడులు సాధించవచ్చు. ఈ సీజన్‌లో వర్షాలు పెద్దగా లేకపోవడం వల్ల మామిడి పంటకు అనుకూలమైన వాతావరణం నెలకొంది. వాతావరణంలో మార్పులు లేకుంటే మామిడి దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది. తెగుళ్ల నివారణకు మందులు ఎలా వాడాలనే అంశాలను రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం.
– లక్ష్మణ్, ఉద్యాన అధికారి, కొల్లాపూర్

మామిడి సాగు వివరాలు..

నియోజకవర్గం	మామిడి సాగు చేస్తున్న రైతులు	సాగు విస్తీర్ణం ఎకరాల్లో	దిగుబడి అంచనా మెట్రిక్ టన్నుల్లో
అచ్చంపేట	622	2,418	9,672
కల్వకుర్తి	1,084	4,547	18,188
కొల్లాపూర్	11,981	25,237	1,00,946
నాగర్‌కర్నూల్	771	2,510	10,042
మొత్తం	14,458	34,712	1,38,848

ధరలు పెరిగే అవకాశం..

గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో మామిడి దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. హైదరాబాద్ మార్కెట్‌కు ఏపీ నుంచి మామిడి కాయలు రావడంతో వ్యాపారులు ధరలను బాగా తగ్గించారు. తెలంగాణ మామిడిని కేజీ రూ.20 నుంచి రూ.30 వరకు మాత్రమే కొనుగోలు చేశారు. ఏపీలో పంట బాగా ఉండటంతోనే ధరలు తగ్గాయని వ్యాపారులు చెబుతూ వచ్చారు. అయితే ఈసారి తుఫాన్ కారణంగా ఏపీలో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. పూతలు పెద్దగా నిలవలేదు. దీంతో అక్కడ దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. దీంతో తెలంగాణ మామిడికి ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి.

చలో గురుకులం

- 5వ తరగతిలో ప్రవేశాలు షురూ
- జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష
- ఉమ్మడి జిల్లాలో 20 గురుకులాలు



నాగర్‌కర్నూల్ గురుకులంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు

కందనూలు: గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరం 5వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించి.. ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 20 గురుకులాలు ఉండగా.. 5వ తరగతిలో 1,600 సీట్లు ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని బూర్గుపల్లి (కోయిల్‌కొండ), హన్వాడ, భూత్పూర్, నారాయణపేట జిల్లాలోని మక్తల్, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు కల్వకుర్తి, ఊర్కొండ, తెల్కపల్లి, వెల్టూర్ (ఉప్పునుంతల), తెలకపల్లి, కోడేరు, అచ్చంపేట, మన్ననూర్‌లో గురుకులాలు ఉన్నాయి. వనపర్తి జిల్లాలోని పెద్దమందడి, చిట్యాల, పెబ్బేరులో, జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డి, పుల్లూర్, అలంపూర్ చౌరస్తా, కొండాపూర్ (నారాయణపేట)లలో గురుకుల పాఠశాలలు ఉన్నాయి. 5వ తరగతిలో ప్రవేశానికిగాను ఈనెల 18 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష 50 వేలు, పట్టణ ప్రాంతాలకు చెందిన తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2లక్షలకు మించరాదు.

ఒక్కో గురుకులంలో 80 సీట్లు..
ఉమ్మడి జిల్లాలోని 20 గురుకులాల్లో 5వ తరగతికి సంబంధించి 80 సీట్ల చొప్పున సీట్లు ఉన్నాయి. ప్రైవేటుకు దీటుగా విద్యాబోధనతో పాటు, సకల వసతులు ఉంటాయి. ఇంగ్లిష్ మీడియంలో విజయవంతంగా కొనసాగుతున్న గురుకులాల్లో ప్రవేశాలకు తీవ్ర పోటీ ఉంటోంది. ఎస్సీలకు 65 సీట్లు, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలకు 15 సీట్ల చొప్పున కేటాయించారు. ఒక్కసారి ప్రవేశం పొందితే 12వ తరగతి వరకు అన్ని వసతులు కల్పించడంతో పాటు దుస్తులు, పుస్తకాలు, కాస్మోటిక్ చార్జీలు అందించనున్నారు. 5వ తరగతి ప్రవేశం పొందే విద్యార్థులనుంచి http://ttwreis.in,http://tgcet.cgg.gov.in,http:/tgtwgurukulam.telangana.gov.in, http:/mjptbcwreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆసక్తిగల విద్యార్థులు రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఒక ఫోన్ నంబరుతో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవాల్సి ఉంటుంది. వేరే వారి ఫొటోలు పెట్టి దరఖాస్తు చేస్తే సెక్షన్ 416 ఐపీసీ 1,860 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటారు. 2023లో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అర్హత పరీక్ష నిర్వహించనున్నారు.

అదిరిపోయే మెనూ..
- వారానికి నాలుగు రోజులు కోడిగుడ్లు, ఆరు రోజులు పండ్లు అందిస్తారు.
- ఒకటి, మూడు, ఐదో ఆదివారం చికెన్ భోజనం
- రెండవ, నాల్గవ ఆదివారం మటన్ భోజనం
- ప్రతిరోజు నెయ్యి, పాలు
- సాయంత్రం లేదా రాత్రి భోజన సమయంలో స్నాక్స్
- వారంలో కనీసం నాలుగైదు రకాల ఆకు కూరలు, ఎనిమిది రకాల కూరగాయలతో భోజనం
- ప్రతి శనివారం స్వీట్

సద్వినియోగం చేసుకోవాలి..
గురుకులాలు పేద విద్యార్థులకు వరంలాంటివి. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు ఇంగ్లిష్ మీడియం బోధన కావడంతో పాఠశాలల్లో ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.
– వెంకట్‌రెడ్డి, గురుకులాల జిల్లా కోఆర్డినేటర్, నాగర్‌కర్నూల్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలుచేస్తాం
- ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పెంట్లవెల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతుందని తెలిపారు. అధికారులు ప్రజల వద్దకే వెళ్లి ప్రభుత్వ పథకాలు అందించడంతో పాటు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. అనారోగ్యం ఇతరత్రా సమస్యలతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకునే పేదలను సీఎంఆర్‌ఎఫ్‌తో అన్నివిధాలా ఆదుకుంటామని, ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా కొల్లాపూర్‌లోని తన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రతి హామీని నెరవేరుస్తా..
ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎంతో మంది కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేశారని, ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండదన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలు నేరుగా అధికారులను కలిసి సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. ఒకవేళ అధికారులు పరిష్కరించకపోతే కొల్లాపూర్‌లోని తన కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు చెప్పారు. అదేవిధంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, మల్లేశ్వరం సర్పంచ్ తిరుపాటి నాగరాజు, సింగిల్‌విండో డైరెక్టర్ బాల్‌రాజు, ఎంపీడీఓ రామయ్య, హరిప్రసాద్, గోవిందు, వెంకటేష్, బాల్‌రాజు, రాఘవేంద్ర, కుర్మయ్య, నర్సింహనాయుడు, రవి, రాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

క్లుప్తంగా

తెగిన ర్యాలంపాడు కాల్వ



గట్టు: నీటి ఉధృతికి బల్గెర సమీపంలోని నెట్టెంపాడు కాల్వ గట్టు ఆదివారం తెగింది. దీంతో నీరు పక్కనే ఉన్న పొలాల్లోకి ప్రవహించడంతో ఇసుక మేటలు వేసింది. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి గట్టు, మాచర్ల, మీదుగా బల్గెర, ఇందువాసి వైపునకు వెళుతున్న 101 ప్యాకేజీలోని నెట్టెంపాడు కాల్వకు నీటి విడుదల కాస్త పెంచడంతో బల్గెర సమీపంలో కాల్వ నీరు పొంగి పొర్లింది. దీంతో కాల్వ గట్టు తెగిపోయింది. ఉదయం పొలాలకు వెళుతున్న రైతులు విషయాన్ని గమనించి, అధికారులకు సమాచారం అందించారు. దీంతో నీటి విడుదలను నిలిపి వేయడంతో కాల్వకు పూర్తి స్థాయిలో గండి పడకుండా చేయగలిగారు. కాల్వవ గట్టుపై నుంచి నీరు పారడంతో గట్టు సగం వరకు కోతకు గురైంది. దెబ్బతిన్న కాల్వను అధికారులు త్వరగా మరమ్మతు చేయించి, నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. కాల్వ కోతకు గురైన విషయాన్ని తెలుసుకున్న బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి రైతులతో కలసి కోతకు గురైన కాలువను పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాల్వవ కోతకు గురైందని ఆరోపించారు. యాసంగిలో నీటి కొరతతో రైతులు ఇబ్బందులు పడుతుంటే, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరు వృథా అవుతున్నట్లు ఆరోపించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తెలకపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఓ వ్యక్తి(45) మృతిచెందాడు. రెండు, మూడు రోజుల నుంచి తెలకపల్లిలోనే భిక్షాటన చేస్తూ.. ఉన్నాడని స్థానికులు తెలిపారు. అతడి వివరాలు ఎవరికి తెలియకపోవడంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులను సమాచారం కోరగా.. మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని వివరించారు.

మృతదేహం లభ్యం

కొత్తకోట రూరల్: కొత్తకోట మండలం పాలెం సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తి (35) మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. పాలెం సమీపంలోని స్నేహ దాబా వద్ద ఉన్న కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానిక రైతులు.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి ఒంటిపై జంజిరం ఉండగా.. కాల్వ ఒడ్డున బ్యాగ్, దుస్తులు ఉన్నాయి. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఉందని ఎస్ఐ తెలిపారు. ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడా లేక ఎవరైన హత్యచేసి పడేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మౌలాలి గుట్టలో మంటలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో ఉన్న మౌలాలి గుట్టకు ఆదివారం మంటలు అంటుకున్నాయి. మంటలు ప్రమాదవశాత్తు అంటుకున్నాయా? లేకా ఎవరైనా అంటించారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. మంటలను అదుపుచేయడానికి అగ్నిమాపక శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు ప్రయత్నం చేశారు. కొంత మేరకు మంటలు అదుపులోకి వచ్చినా ఇంకా కొంత మేర రాలేదు. గుట్టలో ఉన్న కొన్ని చెట్లు అంటుకున్నాయి. దీంతో పాటు గుట్టపై ఉన్న గడ్డి, ఆకులు అంటున్నాయి.

కాకతీయుల కళావైభవం

కాకతీయుల కళాపోషణకు సజీవ సాక్ష్యాలుగా పలు కట్టడాలు నేటికీ దర్శనమిస్తున్నాయి. భారతీయ సంస్కృతికి ఒక కృతిని, ఆకృతిని కల్పించి.. తమలో దాగిన ఆగమజ్ఞాన నిధిని.. తత్వార్థ ఖనిని రాళ్లల్లో ఇమిడ్చిన కాకతీయుల ప్రతిభ అనన్యం అపూర్వం.. సుమధురం. కాకతీయుల కళామణిహారంలోంచి జాలువారిన కళాఖండాలు ఎన్నో నారాయణపేట జిల్లా నర్వ మండలం పెద్దకడ్మూర్‌లో సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. మన చరిత్ర, సంస్కృతి, వైభవాన్ని ఎలుగెత్తి చాటుతోంది ఇక్కడి బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం. కాకతీయుల కళాపిపాసకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. – నర్వ

- గత చరిత్రకు సాక్ష్యం.. పెద్దకడ్మూర్
- చెక్కు చెదరని బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం
- అద్భుత శిల్ప సంపద
- కాకతీయుల కళాపిపాసకు నిలువెత్తు నిదర్శనాలు



పెద్దకడ్మూర్‌లోని బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నో కోటలు, సంస్థానాలు కాకతీయుల కాలంలో నిర్మించబడ్డాయని చరిత్రకారులు చెబుతున్నారు. నర్వ మండలం పెద్దకడ్మూర్‌లోని అనేక కట్టడాలు గత చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా పేర్కొంటున్నారు. కాకతీయుల కాలంలోని శాతవాహనులు, గుప్తులు, వాకాటములు, కదంబులు రాజ్యపాలన చేశారు. శాతవాహనుల తర్వాత దక్కను భాగమును విశేషంగా ఆక్రమించుకున్న వారు పల్లవులు. పల్లవుల నుంచి కర్ణాటక ఉత్తర భాగాన్ని విడిపించిన వారు కదంబులు. వీరు క్రీ.శ. 4వ శతాబ్దం నుంచి 6వ శతాబ్దం ప్రారంభం వరకు సర్వాధికారాలతో పరిపాలన సాగించారు. ఈ కదంబులు కుంతల దేశాన్నే కాకుండా కర్ణాటకలోని రాయచూర్, గుల్బర్గ, బీజాపూర్, ధారవాడ, బళ్లారిలతో పాటు కర్నూల్, అనంతపురం ప్రాంతాలను తమ ఆదీనంలోకి తీసుకున్నారు. వీటితో పాటు పాలమూరు జిల్లాలోని నారాయణపేట, మక్తల్ తాలుకా, తాండూర్, కోస్గి, కొడంగల్, ఆత్మకూర్, గద్వాల ప్రాంతాలతో పాటు అలంపూర్, అయిజ, కందూర్, కడుమూర్, కోడూర్ ప్రాంతాల్లో కదంబులతో పాటు కర్ణాటక ప్రభువులు ఏలుబడి ఉందని చరిత్ర చెబుతోంది. కదంబులు నాడు నిర్మించిన గ్రామమే కడుమూర్.. నేడు పెద్దకడ్మూర్‌గా పిలవబడుతోందని చరిత్రకారుడు, సాహితీ సేవకుడు కవి బాబు దేవిదాస్‌రావు 'పాలమూరు చరిత్ర' గ్రంథంలో పేర్కొన్నారు.

మరో కథ వెలుగులో..

నేటి పెద్దకడ్మూర్ ప్రాంతం జూరాల ప్రాజెక్టు అతి సమీపంలోని కృష్ణానది తీరంలో ఉండటంతో కాకతీయ రాజు రెండవ పులకేశి వేటకు వచ్చాడంటా. ఈ ప్రాంతం దట్టమైన అడవి.. కృష్ణనది సోయగాలతో రెండవ పులకేశిని మంత్రముగ్దులను చేసిందంటా. దీంతో ఇక్కడ ఓ గ్రామాన్ని నిర్మించాలని ఆయన తలంచారు. రాజులు తలచుకుంటే కొదవే ముంటుందన్న చందంగా సైనికులు, నిపుణులు, శిల్పులతో కలిసి రాజుకు ఇష్ట దైవమైన బాలబ్రహ్మేశ్వరుడి ఆలయం నిర్మించారని గ్రామంలో చెబుతున్నారు. ఆలయంతో పాటు గ్రామముఖ ద్వారం, గ్రామదేవత ఆలయం, నాగదేవతల ఆలయాలు రూపొందించారు. ఈ అద్భుతమైన కట్టడాలు, కాకతీయుల కళాపోషణకు నిదర్శనాలుగా నిలిచి, నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

చరిత్రకు సాక్ష్యంగా కల్యాణి చాళుక్యుల శాసనం



బాలబ్రహ్మేశ్వర ఆలయంలోని వీరభద్రుడి విగ్రహం

పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర ఆలయ ప్రాంగణంలో కల్యాణి చాళుక్యుల శాసనం గత చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ శాసనాన్ని చరిత్రకారుడు బాబు దేవిదాస్‌రావు విపులంగా వివరించారు. కదంబుల కాలంలో పాలమూరు జిల్లాపై కర్ణాటక ప్రభువుల ఏలుబడి ఎక్కువగా ఉండేది. దీంతో నాటి కదంబూరు (కడ్మూర్), నాగలకడ్మూర్ గ్రామాలు ఆత్మకూర్ తాలుకాలో ఉండేవి. కడ్మూర్‌లోని బాలబ్రహ్మేశ్వర ఆలయ ఆవరణలో స్థాపించిన శాసనంలో అనేక అంశాలను పొందుపర్చారు. అహవమల్లరాయ నారాయణుడి పరిపాలన కాలంలో మూడవ ఏట వీరబలంజయ ధర్మప్రతిపాదకులైన 'ఆయావోళేనూర్వర స్వాములు' కర్ణాటక దేశాన 4వేల ఉభయ నానాదేశి వర్తకులు పెద్దకడ్మూర్‌లో కూర్చొని తమ సంఘం వారికై చేసుకున్న కట్టుబాట్లను శాసన రూపకంగా పొందుపర్చినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. కాగా.. గత వైభవాన్ని చాటే కాకతీయుల కళాఖండాలను సంరక్షించాలని పలువురు కోరుతున్నారు.

చారిత్రక ఆలయాన్ని సంరక్షించాలి



కళ్యాణి చాళుక్యుల కాలం నాటి చారిత్రక నేపథ్యం కలిగిన బాలబ్రహ్మేశ్వర ఆలయాన్ని సంరక్షించాలి. గ్రామస్తుల చైతన్యంతో కొంత అభివృద్ధి జరిగింది. ఆలయాన్ని ప్రాచీన ఆలయంగా గుర్తించి, విలువైన శిల్పసంపదను కాపాడాలి.

– తంబలి నర్సింహయ్య, బాలబ్రహ్మేశ్వర ఆలయ అర్చకుడు

అద్భుత శిల్ప సౌందర్యాలకు నిలయం..



అద్భుత శిల్ప సౌందర్యాలకు నిలయం బాలబ్రహ్మేశ్వర ఆలయం. గ్రామముఖ ద్వారాలు, నాగదేవతల స్థలాలను సంరక్షించాలి. చారిత్రక నేపథ్యం కల్గిన ఈ కట్టడాలను పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారులు సందర్శించి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి. గ్రామస్తుల సహకారంతో ఆలయాలను సంరక్షించుకుని ప్రస్తుతం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్ ఆంజనేయస్వామి ఆలయ అర్చకుడు



పెద్దకడ్మూర్‌లో కాకతీయులు నిర్మించిన ముఖద్వారం

తాడిపర్తిలో గంజాయి పట్టివేత



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

గోపాల్‌పేట: ముగ్గురు యువకులు అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా పోలీసులు ఆదివారం మధ్యాహ్నం పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా.. వనపర్తికి చెందిన ముగ్గురు యువకులు హైదరాబాద్‌లోని దూల్‌పేట నుంచి డ్రై గంజాయిని బస్సులో తీసుకెళ్తున్నారని పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే తాడిపర్తి బస్టాండ్ సమీపంలో బస్సును నిలిపి తనిఖీ చేయగా ముగ్గురు యువకుల వద్ద 14 ప్యాకెట్లలో 190 గ్రాముల డ్రై గంజాయి దొరికింది. సాయంత్రం గోపాల్‌పేట ఎంపీడీఓ ఉసేనప్ప సమక్షంలో పంచనామా నిర్వహించి యువకులు సోను, భాను, అరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.





ఆటో బోల్తా: నలుగురి పరిస్థితి విషమం





గాయపడిన కూలీలు,గుంతలో పడిన ఆటోను బయటకు తీస్తున్న స్థానికులు

అచ్చంపేట రూరల్: అతివేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో 10 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగాపూర్‌కు చెందిన కూలీలు శివారు ప్రాంతంలోని మిరపతోట వద్దకు ఆదివారం ఉదయం కూలీకి వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి గ్రామానికి ఆటోలో వస్తుండగా.. మార్గమధ్యంలో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. 10 మంది కూలీలకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. రూప్లి, చిన్ని, భామిని, రాజికి కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అచ్చంపేట ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా గాయపడిన నలుగురిని హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. డ్రైవర్ రాంలాల్ నిర్లక్ష్యంగా ఆటోను నడపడంతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్పారు.

ఏదుట్ల సమీపంలో ఆటో, బస్సు ఢీ

గోపాల్‌పేట: ఏదుట్ల సమీపంలో బస్సు, ఆటో ఢీకొనడంతో ఆశావర్కర్ కాలు పూర్తిగా విరిగిపోయింది. రాజాపూర్‌కి చెందిన ఊర్కొండ రాణి కోడేరు మండలంలోని రాజాపూర్‌లో ఆశావర్కర్‌గా పని చేస్తోంది. ఆదివారం వనపర్తికి వెళ్లి సాయంత్రం రాజాపూర్‌కు ఆటోలో తిరుగు ప్రయాణమైంది. ఏదుట్ల లోపలికి ఆటో వెళ్తుండగా.. నాగర్‌కర్నూల్ నుంచి వనపర్తి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను పక్క నుంచి ఢీకొట్టింది. రాణి కాలు కొంత బయటకు ఉండటంతో కాలు పూర్తిగా విరిగి కింద పడిపోయింది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గోపాల్‌పేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

కోడి పందేల స్థావరాలపై దాడి



కోడి పందెల జూదర్లతో పోలీసులు

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం పర్థిపూరం గ్రామ సమీప పొలాల్లో కొందరు కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జూదర్లు పారిపోతుండగా ఆరుగురిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిపై కేసు నమోదు చేశారు. వారి నుంచి ఆరు కోళ్లు, ఆరు సెల్‌ఫోన్లు, రూ.2,200 నగదును స్వాధీనం చేసుకుని ఎస్ఐ ఆర్.శేఖర్ తెలియజేశారు.



విద్యుత్ మోటార్ల వైర్లు చోరీ



కొత్తకోట శివారులో మోటార్ వద్ద చోరీకి గురైన వైరు

కొత్తకోట రూరల్: కొత్తకోట, కానాయపల్లి శివారులోని రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్ల వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం కానాయపల్లి, కొత్తకోటకు చెందిన రైతుల వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ వైర్లు దొంగిలించిన ఓ వ్యక్తిని గుర్తించి పోలీసులకు పట్టిస్తే.. మదనాపురం మండలానికి చెందిన ఓ బీఆర్ఎస్ నాయకుడు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దొంగను విడిపించుకుని రైతులకు కాస్త డబ్బులు ఇప్పించి చేతులు దులిపేసుకున్నారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున ఎప్పటిలాగే కొత్తకోట శివారులోని మరికొందరి రైతులకు సంబంధించిన వైర్లను కట్ చేసుకుని ఎత్తుకెళ్లగా రైతులు పోలీసుల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోలీసులకు పట్టించిన దొంగపై చర్యలు తీసుకోకపోవడంతో తరచూ మోటర్ల వైర్లను దొంగతనం చేస్తున్నారని, పోలీసులు స్పందించి రాత్రి వేళల్లో ప్రత్యేక టీంలతో గస్తీ పెంచితేనే చోరీలను అరికట్టవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పప్పుశనగలో పచ్చపురుగు నివారణ





అలంపూర్ శివారులో సాగు చేసిన పప్పుశనగ పంట, ఆశించిన పచ్చపురుగు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వాతావరణ ప్రతికూల పరిస్థితులను తట్టుకొని రైతులు పప్పుశనగ పంట సాగుచేశారు. సాగునీటి వనరులు పుష్కలంగా లేకపోవడంతో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు పప్పుశనగ పంటపైనే దృష్టి సారిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది తక్కువ మొత్తంలో పప్పుశనగ సాగైంది. ఇక్కడ ఉన్న పొలాలకు అనువుగా రైతులు ఆయా రకాల విత్తనాలతో పంట సాగు చేశారు. అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకొని పంట ఏపుగా పెరుగుతోంది. పంటకు పచ్చపురుగు ఆశిస్తోంది. పచ్చపురుగు ఆశించిన పంటకు నివారణ చర్యలు చేపట్టకుంటే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ సూచిస్తున్నారు. పచ్చపురుగు తల్లిపురుగు లేత ఆకు చివర బంగారు రంగులో గుడ్లు పెడుతుందని, నాలుగు రోజుల తర్వాత ఈ గుడ్డు నుంచి పురుగు బయటికి వచ్చి కాయలను, పూతను, పిందెలను తింటూ పంటకు నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు.

ఇలా నష్టపరుస్తోంది..

పచ్చపురుగు ఆకులను తింటూ కాయలోకి చేరుకుంటుంది. గింజలోకి చేరిన పచ్చపురుగు లోపలి కాయను మాత్రమే తింటూ తొట్టెను వదిలేస్తుంది. వీటి ఉధృతి ఎక్కువగా ఉంటే పంటపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దాదాపు 60 నుంచి 80 శాతం పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది.

పచ్చపురుగు నివారణకు ఇలా..

పప్పుశనగ పంటకు పచ్చపురుగు ఆశిస్తే తప్పక నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

- ముందుగా 5 మిల్లీలీటర్ల వేపనూనెను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీన్ని పిచికారీ చేయడంతో గుడ్డు నాశనం అవుతుంది.
- వేపనూనెలో ఉన్న కాషాయంతో పంటను తినలేక చనిపోతుంది.
- క్లోరో 2 మిల్లీలీటర్లు లేదా అసిఫెట్ 1.5 గ్రామును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- కోరాజెన్(రెనాక్సిపెర్) 0.3 మిల్లీలీటర్ల మందును లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలి.
- ఫ్లూ బెండమైడ్ 0.3 మిల్లీలీటర్ల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.
- ఫ్లీతోరా 1 మిలీలీటర్ మందును లీటర్ నీటిలో కలిపి పిచుకారీ చేసుకోవాలి.

కాయ బరువు పెరగడానికి..


పంట సాగులో కాయ బరువు, కాయ పూర్తిగా ఉండటానికి 13:45 పోషకాన్ని లీటర్ నీటికి 5 గ్రామాలు కలిపి తప్పక పిచికారీ చేసుకోవాలి.

చిరుత దాడిలో మేక మృతి

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని అవుసలికుంట గ్రామశివారులో శనివారం చిరుత దాడిలో మేక మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పుట్ట నాగులు అనే మేకల యజమాని తన మేకలను గ్రామ సమీపంలోని బండగుట్ట వద్ద మేత మేయిస్తుండగా పొదల మాటు నుంచి అకస్మాతుగా చిరుత దాడి చేసి మేకను చంపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. దీని విలువ రూ.10 వేలు ఉంటుందని తెలిపారు. అదే విధంగా కొత్తచెర్వుతండా సమీపంలో గొర్రెను చిరుత చంపినట్లు తెలిసింది.









ఆదివారం తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ దర్శించుకున్నారు.

వి'నూతన' వేడుకలు

ఒక్కో దేశంలో ఒక్కో విధంగా నూతన సంవత్సర సంబరాలు

ఆహారం నుంచి ఆధ్యాత్మికత వరకు విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు

సాక్షి, అమరావతి: కొత్త సంవత్సరం వచ్చిందంటే.. ప్రతి ఒక్కరిలోనూ సరికొత్త ఉత్సాహం వచ్చేస్తుంది. పాత ఏడాది ఇచ్చిన చేదు అనుభవాలను మరిచిపోయి.. తీపి జ్ఞాపకాలను గుర్తుపెట్టుకొని సరికొత్త ఆకాంక్షలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. అయితే ఈ వేడుకలు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా జరుగుతుంటాయి. భిన్న సంస్కృతులు, విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు ప్రతిబింబిస్తాయి. ప్రపంచమంతా క్రమంగా 2023కు వీడ్కోలు పలుకుతూ.. 2024కు స్వాగతం పలికిన తరుణంలో.. వివిధ దేశాల ప్రజలు జరుపుకునే వేడుకలకు సంబంధించిన ఆసక్తికర అంశాలు..

- డెన్మార్క్‌లో ప్రజలు తమ ఇళ్లలోని పింగాణీ పాత్రలను గది తలుపులపై విసిరేస్తారు. అవి పగిలి.. ఎన్ని ముక్కలైతే కొత్త ఏడాది అంత అదృష్టం కలిసొస్తుందని వారి నమ్మకం.
- గ్రీస్ ప్రజలు 'వాసిలోపిటా' అనే కేక్‌లో ఒక నాణాన్ని కనిపించకుండా పెడతారు. ఎవరికైతే ఆ నాణెం ఉన్న కేక్ భాగం వస్తుందో.. వారికి ఆ ఏడాదంతా అదృష్టం కలిసి వస్తుందని విశ్వసిస్తారు.
- నూతన సంవత్సరం అంటేనే పాతకు వీడ్కోలు చెప్పడం. దీనికి సూచికగా దక్షిణాఫ్రికా ప్రజలు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి పాత వస్తువులను కిటికీల నుంచి బయటకు విసిరేస్తారు.
- స్కాట్లాండ్‌లో అర్ధరాత్రి దాటాక తమ ఇంట్లోకి మొదటగా ఎవరు అడుగు పెడతారో.. వారి వల్ల అదృష్టం వస్తుందని విశ్వసిస్తూ బహుమతులు ఇచ్చుకుంటారు.
- స్పెయిన్‌లో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలు కాగానే.. 12 ద్రాక్ష పండ్లు తినడం సంప్రదాయం. ఒక్కో పండు ఒక్కో నెలకు సంకేతం. ఇలా తినటం వల్ల అదృష్టం లభిస్తుందని నమ్ముతారు.
- జపాన్‌లో ప్రజలు అర్ధరాత్రి వేళ బౌద్ధ దేవాలయాలకు వెళ్లి 108 సార్లు గంటలు మోగిస్తారు.
- బ్రెజిల్‌లో జనం తెలుపు రంగు దుస్తులు ధరించి సముద్ర దేవత యెమాంజకు నైవేద్యంగా సముద్రంలోకి పువ్వులను విసిరి పాటలు పాడుతారు.
- ఫిలిప్పీన్స్‌లో గుండ్రని ఆకారంలో ఉన్న వస్తువులు, దుస్తులు అదృష్టం తెచ్చిపెడతాయని విశ్వసిస్తారు. అందువల్ల అక్కడి వారు నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ గుండ్రని చుక్కలు ఉన్న దుస్తులు ధరిస్తారు. ఆ రోజు గుండ్రని పండ్లు తింటారు.
- రష్యాలో కాగితంపై న్యూ ఇయర్ విషెస్ రాసి దానిని కాల్చి ఆ పొడిని అర్ధరాత్రి షాంపైన్లో కలుపుకొని తాగుతారు.
- అమెరికాలోని న్యూయార్క్‌లో అర్ధరాత్రి 12 గంటలకు టైమ్ బాల్‌ను కిందకు వదులుతారు. దీన్ని 'బాల్ డ్రాప్' అంటారు. అలా వారికి కొత్త సంవత్సరం మొదలవుతుంది.



చైనాలో జరుపుకోరు..

జనవరి 1న కొత్త సంవత్సర వేడుకలను నిర్వహించుకోని దేశాలుకూడా ఉన్నాయి. చైనాతోపాటు సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, వియత్నాం దేశాలు న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవు. వారి క్యాలెండర్ ప్రకారమే అక్కడ కొత్త సంవత్సరం వేడుకలు నిర్వహించుకుంటారు. చైనా ప్రజలు ఫిబ్రవరి నెలలో నూతన సంవత్సరాన్ని ఘనంగా జరుపుకుంటారు.

అయోధ్యకు శ్రీ రామ పాదుకలు

హైదరాబాద్ నుంచి నేడు తీసుకెళ్లనున్న అయోధ్య భాగ్యనగర సీతారామ సేవ ఫౌండేషన్



ఓల్డ్ బోయిన్‌పల్లి (హైదరాబాద్): అయోధ్య రామమందిరంలో ఉండబోయే శ్రీరామ పాదుకలు మన దగ్గరే సిద్ధమయ్యాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటకు చెందిన లోహశిల్పి రామలింగాచారి ఈ శ్రీరామ పాదుకలను తయారు చేశారు. ఈ పాదుకలను ఆదివారం భవానీనగర్‌లోని శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇక్కడి నుంచి సోమవారం ఉదయం అయోధ్యకు తీసుకెళ్లేందుకు అయోధ్య భాగ్యనగర సీతారామ సేవ ఫౌండేషన్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి ఏర్పాట్లు చేశారు. ఈ శ్రీరామ పాదుకలు తయారు చేయడానికి 12 కిలోల పైగా పంచలోహం వినియోగించారు. ఇందుకు 25 రోజులకు పైగా సమయం పట్టింది. శ్రీరామ పాదుకలు ఆలయంలో ఉంచారని తెలుసుకున్న ప్రజల వాటి దర్శనానికి బారులుతీరారు. అయోధ్యలో పాదుకలను తాకే అదృష్టం తమకు దక్కకపోవచ్చనే భావనతోనే ప్రజలు భారీగా తరలివచ్చారు.

నీటినిల్వలో అగ్రగామి 'కృష్ణా'

- రెండోస్థానంలో గంగ.. మూడోస్థానంలో గోదావరి
- తొమ్మిదోస్థానంలో పెన్నానది
- బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలే



సాక్షి, అమరావతి: దేశంలో అత్యధిక నీటినిల్వ సామర్థ్యం గల జలాశయాలున్న నదుల్లో కృష్ణానది అగ్రగామిగా నిలిచింది. అతి పెద్ద నది అయిన గంగ, రెండో అతి పెద్ద నది అయిన గోదావరి కన్నా నీటినిల్వ సామర్థ్యం ఉన్న జలాశయాల్లో అగ్రగామిగా కృష్ణానది కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డుల్లోకి ఎక్కింది. దేశంలో హిమాలయ, ద్వీపకల్ప నదులతోపాటు అన్ని నదీపరివాహక ప్రాంతాల్లో (బేసిన్‌లలో) నిర్మాణం పూర్తయిన జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 9,105.92 టీఎంసీలు. ఇందులో 1,788.99 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లతో కృష్ణానది ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 589.67 టీఎంసీలు కావడం గమనార్హం. అంటే.. దేశంలో అన్ని బేసిన్లలోని రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో కృష్ణా బేసిన్ రిజర్వాయర్ల సామర్థ్యం 19.65 శాతం కావడం గమనార్హం.

గంగా, గోదావరి కన్నా మిన్న..

హిమాలయ పర్వతాల్లో హిమానీనదాల్లో జన్మించి దేశంలో ప్రవహించే గంగానది అతి పెద్దది. గంగా బేసిన్‌లో ఉన్న జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 1,718.91 టీఎంసీలు. పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద జన్మించి ద్వీపకల్పంలో ప్రవహించే గోదావరి రెండో అతి పెద్ద నది. ఈ బేసిన్‌లో రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 1,237.61 టీఎంసీలు. వీటిని పరిశీలిస్తే.. నీటినిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లలో గంగ, గోదావరి కంటే కృష్ణానదే మిన్న అని స్పష్టమవుతోంది. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో గంగ, గోదావరి రెండు, మూడు స్థానాల్లో నిలవగా.. దేశంలో పశ్చిమం వైపు ప్రవహించే నర్మదానది నాలుగోస్థానంలో నిలిచింది. ఇక దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే వర్షఛాయ ప్రాంతంలో పుట్టి, ప్రవహించే పెన్నానది బేసిన్‌లో 239.59 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లున్నాయి. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో పెన్నా బేసిన్ దేశంలో తొమ్మిదోస్థానంలో నిలవడం గమనార్హం. హిమాలయ నది అయిన బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలు మాత్రమే.

దేశంలో ప్రధాన నదీపరివాహక ప్రాంతాల్లోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం

నదీపరివాహక ప్రాంతం	రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)
1. కృష్ణా	1,788.99
2. గంగ	1,718.91
3. గోదావరి	1,237.61
4. నర్మద	770.54
5. సింధు	572.99
6. మహానది	461.45
7. తాపి	322.71
8. కావేరి	320.81
9. పెన్న	239.59
10. మహి	177.20
11. బ్రహ్మపుత్ర	88.65

మీ భాగస్వామికి బీపీ ఉందా.. అయితే మీరూ జాగ్రత్త!

- దంపతుల్లో ఒకరికి రక్తపోటు ఉంటే మరొకరిపైనా దాని ప్రభావం
- భారత్‌లో 50 ఏళ్లు పైబడిన వారిలో 20శాతం దంపతుల్లో అధిక రక్తపోటు సమస్య
- అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ ప్రచురించిన అధ్యయనంలో వెల్లడి
- దేశంలో 22వేల జంటలపై అధ్యయనం
- ఇంగ్లాండ్, యూఎస్, చైనా దేశాల్లోనూ అధ్యయనం



సాక్షి, అమరావతి: అధిక రక్తపోటు(హైబీపీ).. ప్రస్తుతం యువత సైతం ఈ సమస్యను ఎదుర్కొంటోంది. అంతేకాదు భార్యాభర్తల్లో ఏ ఒక్కరికి ఈ సమస్య ఉన్నా రెండో వ్యక్తికి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రముఖ విశ్వవిద్యాలయాలు చేసిన అధ్యయనంలో తేలింది. మన దేశంలో 50 ఏళ్లు పైబడిన 20 శాతం దంపతుల్లో ఇద్దరు హైబీపీతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. హైబీపీ లేని వారిని పెళ్లి చేసుకున్న మహిళలతో పోలిస్తే.. సమస్య ఉన్న వారిని వివాహం చేసుకున్న మహిళలు ఈ వ్యాధి బారినపడటానికి 19శాతం ఎక్కువ అవకాశం ఉన్నట్లు తేలింది. ఇంగ్లాండ్, అమెరికా, చైనా దేశాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఈ మేరకు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైన ఒక అధ్యయనం వెల్లడించింది.

ఇవీ సర్వేలో గుర్తించిన కీలక అంశాలు

- మిచిగాన్, ఎమోరీ, కొలంబియా విశ్వవిద్యాలయాలు 2015–19 మధ్య ఒక అధ్యయనం చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంగ్లాండ్‌లో 1,086, యూఎస్‌ఏలో 3,989, చైనాలో 6,514, భారత్‌లో 22,389 జంటల ఆరోగ్యాన్ని పరిశోధకులు విశ్లేషించారు. వీరంతా యూఎస్‌ఏ, ఇంగ్లాండ్ దేశాల్లో 50 ఏళ్లు, అంతకంటే ఎక్కువ, చైనా, భారత్‌లో 45 ఏళ్లు, ఆ పైబడిన వయసు వారే ఉన్నారు.
- ఇంగ్లాండ్‌లో 47.1శాతం, యూఎస్‌లో 37.9 శాతం, చైనాలో 20.8శాతం, భారత్‌లో 19.8 శాతం జంటలు (భార్యాభర్తలు) హైబీపీతో బాధపడుతున్నట్లు గుర్తించారు.
- చైనా, భారత్ దేశాల్లో దంపతుల్లో ఏ ఒక్కరికి సమస్య ఉన్నా రెండోవారు కూడా దాని బారినపడే పరిస్థితి బలంగా ఉన్నట్లు అధ్యయనంలో గుర్తించారు.
- హైబీపీ లేని వ్యక్తులను పెళ్లి చేసుకున్న మహిళలతో పోలిస్తే.. సమస్య ఉన్నవారిని వివాహం చేసుకున్న మహిళలు హైబీపీ బారినపడటానికి అమెరికా, ఇంగ్లాండ్ దేశాల్లో 9శాతం ఎక్కువ అవకాశం ఉందని నిర్ధారించారు. చైనాలో అయితే ఏకంగా 26శాతం ఉన్నట్టు వెల్లడించారు.
- పురుషుల విషయంలోనూ ఇలాగే జరుగుతుండటం గమనార్హమని పరిశోధకులు తెలిపారు.
- భార్యాభర్తల మధ్య భావోద్వేగ బంధాలు, ఇష్టాయిష్టాలు, ఒకరిపై మరొకరు ఆధారపడటం, జీవనశైలి, ఇతర అంశాలు ఆరోగ్యం మీద పరస్పర ప్రభావాన్ని చూపుతున్నట్లు అంచనా వేశారు.

త్యాగానికి ప్రతిరూపం అమ్మ

- మశమ్మ స్మారక పురస్కారం ప్రదానోత్సవంలో ఓయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కాశీం



డా.వినోదిని సన్మానిస్తున్న ఓయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కాశీం

కందనూలు: అమ్మ త్యాగానికి ప్రతిరూపమని ఓయూ తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ డా.కాశీం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశ హాల్‌లో ఎదిరెపల్లి మశమ్మ స్మారక అవార్డును కడప యోగివేమన యూనివర్సిటీ కవయిత్రి, సామాజిక ఉద్యమకారిణి డా.వినోదినికి అందజేశారు. అవార్డుతో పాటు శాలువా, జ్ఞాపిక, సన్మానపత్రం, రూ.20 వేల నగదును ప్రొఫెసర్ కాశీం చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మశమ్మ చిత్రపటానికి పూలమాల, వేసి నివాళి అర్పించారు. అనంతరం డా.కాశీం మాట్లాడారు. వీరుడైనా ఉద్యమకారుడైనా, శ్రామికుడైనా ప్రాణికైనా జీవరాశికైనా అమ్మ, అమ్మనే, అమ్మకు ప్రత్యామ్నాయం లేదన్నారు. బహుజన తల్లుల కథలు అనుభవాలు రికార్డు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమ్మ జీవితం అంటే ఓర్పు, సహనం ప్రేమ ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ మశమ్మ లాంటి తల్లులు ఎందరో తమ పిల్లలను పోషించి సమాజానికి అందించారని తెలియజేశారు. ఈ సమాజ మార్పుకోసం మహిళల అసమానతలు నేటికీ ఉన్నాయన్నారు. ఈ అవార్డు నెలకొల్పి సామాజిక మార్పుకోసం కృషిచేస్తున్న డా.వినోదినికి ఇవ్వడం సముచితమని ఆమెను అభినందించారు. అవార్డు గ్రహీత డా.వినోదిని మాట్లాడారు. తాను సామాజిక సాంఘిక దురాచారాలు, అంటరానితనం నిర్మూలనకు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కృషి చేశానన్నారు. ఈ జిల్లాతో తనకు ప్రత్యక్ష అనుబంధం ఉందని, ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు, హెచ్. రమేష్ బాబు, విద్యావేత్త భాస్కర్ రావు, అవార్డు చైర్మన్ ఎదిరెపల్లి కాశన్న, వహీద్ ఖాన్, కందికొండ మోహన్, ముచ్చర్ల దినకర్, వనపట్ల సుబ్బయ్య, నాగవరం బాల్ రామ్, ప్రతాప్ కౌటిల్య, గుడిపల్లి నిరంజన్, దేవరపాగ ప్రభాకర్, వెంకట్ పవార్, మహమ్మద్ ఖాజ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

'కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలు, ఆలయాలు సోమవారం రద్దీగా మారనున్నాయి. డిసెంబర్ 31 ఆదివారం, సోమవారం ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంతో పర్యాటకులు అధికంగా తరలి వచ్చే అవకాశం ఉంది. ఇందుకోసం ఆయా ప్రాంతాలు, ఆలయాల్లో ఇందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేశారు.'



పిక్నిక్ స్పాట్ కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్

స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ అప్పన్నపల్లి సమీపంలోని కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్‌కు వారాంతపు రోజులతో పాటు పండుగ వేళల్లో వందలాది మంది సందర్శకులు తరలివస్తుంటారు. 2,087 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ పార్క్ పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందిస్తోంది. కొత్త సంవత్సరం వేళ వేలాదిమంది సందర్శకులు వచ్చే అవకాశం ఉంది. అదేవిధంగా పిల్లలమర్రికి కూడా సందర్శకులు రానున్నారు. ఇక్కడి మినీ జూపార్క్, పురావస్తుశాఖ మ్యూజియం సందర్శిస్తారు.

ఆధ్యాత్మిక పీఠం.. లలితాంబిక ఆలయం



ఏకశిల శ్రీ చక్ర మహా మేరు

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న లలితాంబిక ఆలయం కొత్త సంవత్సర వేడుకలకు ముస్తాబైంది. ఏటా జనవరి 1న సమీప గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల ప్రాంతాలవాసులు సుమారు 20 వేల మంది అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయం రెండు అంతస్తులు ఉండగా మొదటి అంతస్తులో 5 అడుగుల ఏకశిలతో తయారు చేసిన శ్రీచక్రం మహామేరు దేశంలోనే మొట్టమొదటిది కావటం ప్రత్యేకత. రెండో అంతస్తులో లలితాంబికాదేవి విగ్రహం ప్రతిష్ఠించారు. అమ్మవారి పాలరాతి విగ్రహం చూపరులను ఆకట్టుకునేలా ఉంటుంది. శ్రీచక్ర మహామేరు అనంతరం అమ్మవారిని దర్శించుకోవటం భక్తులు పుణ్యకార్యంగా భావిస్తారు. రాజగోపురం నుంచి ఆలయం వరకు ఇరువైపులా ఉన్న దేవతా మూర్తుల విగ్రహాలతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిస్తుంది. మళయాల రామేశ్వరానంద స్వామి ప్రారంభించిన ఆలయాన్ని ప్రస్తుతం సర్వేశ్వరానంద స్వామి నిర్వహిస్తున్నారు. ఆలయంలో వినాయక, సుబ్రహ్మణ్య స్వామి, హనుమత్ సమేత సీతారాములు, కాశీ విశ్వనాథలింగం, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణ, సాయిబాబా ఉపాలయాలు ఉన్నాయి. ఆలయం ప్రాంగణంలో నవగ్రహాలు, ఆంజనేయస్వామి ఆలయాలు కొలువై ఉన్నాయి. అలాగే ఆలయంలో మళయాళస్వామి, రామేశ్వరానందస్వామి విగ్రహాలు సైతం ఉన్నాయి.

సెంటిమెంట్ దేవత.. పర్వతాపూర్ మైసమ్మ




ప్రత్యేక అలంకరణలో మైసమ్మ దేవత

నవాబుపేట: మండలంలోని కాకర్లపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయం ఇటు జిల్లాకేంద్రానికి, అటు మండల కేంద్రానికి మధ్యలో 9 కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉంటుంది. కొత్త వాహనాలకు పూజలు చేయించడం ఆనవాయితీగా వస్తోంది. ఎన్నికల సమయంలోనూ వివిధ పార్టీల అభ్యర్థులు ఇక్కడి నుంచే ప్రచారం ప్రారంభిస్తారు. ఈ ఆలయం కూడా కొత్త సంవత్సరం వేళ రద్దీగా ఉంటుంది.

కృష్ణాతీరంలో..

కొల్లాపూర్: జనవరి ఒకటో తేదీన నియోజకవర్గంలోని కృష్ణా తీర ప్రాంతాలు, నదీతీర ఆలయాలను దర్శించుకునేందుకు ప్రజలు అధికసంఖ్యలో తరలివస్తుంటారు. సోమశిల సమీపంలోని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకుంటారు. అనంతరం ఏపీ సరిహద్దు ప్రాంతంలోని సంగమేశ్వర ఆలయానికి వెళ్తుంటారు. కొత్త సంవత్సరం వేడుకల సందర్భంగా ఆయా ఆలయాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. సింగోటం లక్ష్మీనర్సింహ్మస్వామి, మంచాలకట్ట రామలింగేశ్వర స్వామి, కొల్లాపూర్ రామ మందిరం, శివాలయం, వరిదెల హనుమాన్, మాధవస్వామి ఆలయాలకు కూడా భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. సోమశిల, అమరగిరి సమీపంలోని కృష్ణానదిలో విహరించేందుకు బోట్లు అందుబాటులో ఉంటాయి. జటప్రోల్ సమీపంలోని కత్వ వాటర్ ఫాల్స్‌ను తిలకించేందుకు పర్యాటకులు ఆసక్తి కనబరుస్తారు.



సోమశిలలోని ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయం

నేటి నుంచి హ్యాండ్‌బాల్ టోర్నీ



మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో మైదానం సిద్ధం చేస్తున్న ప్రతినిధులు

- మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో అండర్-17 రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహణ
- రెండు మైదానాల్లో మ్యాచ్‌లు
- హాజరుకానున్న పది ఉమ్మడి జిల్లాల జట్లు
- 320 మంది క్రీడాకారులు, 40 మంది అఫీషియల్స్ రాక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో సోమవారం నుంచి ఈ నెల 3 వరకు 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా బాల, బాలికల అండర్-17 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. ఈ మేరకు టోర్నీ నిర్వహణకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. టోర్నీలో ఉమ్మడి జిల్లాలైన మహబూబ్‌నగర్, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్, మెదక్, నల్లగొండలకు చెందిన బాల, బాలికల జట్లు పాల్గొంటున్నాయి. టోర్నీలో బాల, బాలికల జట్లు 320 మంది క్రీడాకారులు, 40 మంది అఫీషియల్స్ హాజరవుతున్నారు. బాలికల మ్యాచ్‌లను గ్రామర్ స్కూల్‌లో, బాలుర మ్యాచ్‌లను శ్రీరామ ల్యాండ్ మార్క్ మైదానంలో నిర్వహించనున్నారు. గ్రామర్ స్కూల్‌లో ఫ్లడ్‌లైట్లో కూడా మ్యాచ్‌లు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. టోర్నీలో రాణించే క్రీడాకారులను ఈ నెలలో మధ్యప్రదేశ్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే తెలంగాణ జట్లకు ఎంపిక చేయనున్నారు.

క్రీడాకారుల వసతి వివరాలు..

లీగ్ కం నాకౌట్ పద్ధతిలో హ్యాండ్‌బాల్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. టోర్నీలో బాలుర, బాలికల జట్లకు 40 లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. సోమవారం సాయంత్రం 4 గంటలకు మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ ఘనంగా ప్రారంభం కానునుంది. టోర్నీలో పాల్గొనే బాలుర, బాలికల క్రీడాకారులకు మహబూబ్‌నగర్ గ్రామర్ పాఠశాలలో వసతితోపాటు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం..



ఈ ఏడాది జిల్లాలో ఇప్పటికే పలు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీలు నిర్వహించాం. వాటిని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాం. అందరి సహకారంతో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీని విజయవంతంగా జరిపిస్తాం.

– రమేశ్‌బాబు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు..



ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ జిల్లాలో నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఇటీవలే నవంబర్‌లో ఎస్‌జీఎఫ్ అండర్-19 టోర్నీ నిర్వహించాం. ఈ టోర్నీకి వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

– ఎండీ జియావుద్దీన్, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ



శ్రీరామ ల్యాండ్‌మార్క్ మైదానంలో కోర్టుల ఏర్పాటు